సింగిల్ పేజీ కథలు

# పసి మనసులు

**"అమ్మా కొంచెం అన్నం పెట్టు తల్లీ"**

**"అమ్మా ఆకలితో కడుపు నక నకలాడుతుంది. ఓ ముద్దవుంటే వెయ్యమ్మా" వీధిలో బిచ్చగాడు దీనంగా అదేపనిగా అరుస్తున్నాడు. కానీ ఆ బిచ్చగాడి అరుపులు ఎవరూ వినిపించుకోవటం లేదు.**

ఇంటింటికి వెళ్ళి అరుస్తున్నాడు. కానీ అతని గోడు ఎవరూ పట్టించుకోవటం లేదు. అతని కళ్ళు లోతుగా పీక్కుపోయి వున్నాయి. కాళ్ళు వణుకుతున్నాయి. నీరసంతో అడుగులు తడబడుతూ వున్నాయి. ఆ బిచ్చగాడు నీరసంగా మూలుగుతూ ఇప్పుడో, అప్పుడో పడిపోతాడా అన్నట్టుంది అతని నడక. ఎవ్వరూ అన్నం పెట్టకపోవటంతో, రోడ్డుమీద మెల్లగా నడకసాగించాడు.

"పాపం మమ్మీ అతనికి ఎవ్వరూ అన్నం పెట్టటం లేదు" ముద్దుముద్దుగా, బాధగా అంది అయిదేళ్ళ పింకీ, టీ.వీ.లో వచ్చే సీరియల్ చూస్తూ. సరళ, అతని పిల్లలు, పదేళ్ళ బబ్లూ, అయిదేళ్ళ పింకీ టి.వి.లో వచ్చే 'పేదోడి ఆకలి' సీరియల్‌లో నిమగ్నమయి వున్నారు.

"మమ్మీ పాపం అతను రోడ్డుమీద పడిపోతాడేమో!?" విచారంగా అన్నాడు బబ్లూ.

"ఏమోరా పాపం" జాలి నిండిన కళ్ళతో బాధగా అంది సరళ.

టి.వి.సీరియల్‌లో ఆ బిచ్చగాడ్ని చూసి ఆ ముగ్గురి ముఖాలు జాలితో నిండిపోయాయి. సరళయితే ఇక చెప్పక్కర్లేదు. ఇంతలోనే స్తరున యాడ్స్ వచ్చేశాయి. సరళ విసుక్కుంటూ "ఈ యాడ్స్ ఒకటి మధ్యలో" అనుకుంటూ లోపలికి వెళ్ళి పిల్లలకు ప్లేట్లలో చేగోడీలు పెట్టి తీసుకొచ్చింది. పిల్లలకు సర్వ్ చేసి కూర్చునేటప్పటికి మళ్ళీ సీరియల్ ప్రారంభమయింది. ఆసక్తిగా చూస్తున్నారు ముగ్గురు. మళ్ళీ ఆ ముసలి బిచ్చగాడు రోడ్డుపై నడక ప్రారంభించాడు. మెల్లగా, అతి మెల్లగా తూలుతూ నడుస్తున్నాడు. ఎదురుగా లారీ వస్తోంది. "మమ్మీ లారీ వస్తుంది" టెన్షన్‌లో చిన్నగా అరిచాడు బబ్లూ.

"ఉండరా నువ్వొకడివి. నేనసలే టెన్షన్‌తో చచ్చిపోతుంటే" ఆతృతగా సీరియల్‌నే చూస్తూ అంది సరళ. అంతే మరో అయిదు నిముషాలు బిచ్చగాడిని, లారీని, మార్చి మార్చి చూపించి తరువాయి భాగం వచ్చేవారం అంటూ వేసేశారు.

ఉస్సూరుమంటూ సరళ- "ఈ సీరియల్స్ అన్నీ ఇంతే. గొంతులో అన్నం గొంతులోనే వుండి మింగుడుపడనట్టు సగంలోనే ఆపేస్తారు" విసుక్కుంటూ టి.వి. ఆఫ్ చేసేసింది.

* * *

"సరళా చీరలబ్బాయి వచ్చి వున్నాడు చీరలు చూస్తావా" గోడమీద నుంచి తలపెట్టి కేకేసింది పక్కింటి పిన్నిగారు.

"వస్తున్నా పిన్నిగారు ఒక్క నిముషం" చీరలనేసరికి హడావిడిగా పిల్లలకు చెప్పి పక్కింటికి వెళ్ళింది సరళ. అరగంటసేపు అవి, ఇవి చూశాక ఏవీ నచ్చక వచ్చేసింది సరళ. వచ్చేటప్పుడు పిన్నిగారి ఇంటిముందు ఓ బిచ్చగాడు అడుక్కుంటున్నాడు. అతని చేతిలోని స్టీలు గిన్నె కొత్తది కాబోలు తళుక్కున మెరుస్తోంది. పరాకుగా వచ్చేస్తున్న సరళకు, అతని చేతిలోని గిన్నెపై దృష్టి పడింది. "అరె ఉదయం పాత బట్టలు వేసి కొన్న గిన్నెలా వుందే, ఇతని చేతిలోకి ఎలా వచ్చిందబ్బా" అనుకుంటూ దగ్గరకు వెళ్ళి గిన్నెను పరీక్షగా చూసింది. అవును ఖచ్చితంగా ఇది తను కొన్న గిన్నే అనుకుంటూ కోపంగా బిచ్చగాడ్ని చూస్తూ- "ఈ గిన్నె నీ చేతిలోకి ఎలా వచ్చింది?" అడిగింది.

దానికి బిచ్చగాడు కంగారుపడుతూ- "అమ్మా అది..." అంటూ నసిగాడు.

"బిచ్చమెత్తుకోవడానికి అని వెళ్ళి ఇంట్లో ఎవరూ లేకుండా చూసి గిన్నె ఎత్తుకొచ్చేశావా?" కోపంగా అడిగింది.

"అమ్మా అది కాదమ్మా" దీనంగా ముఖం పెట్టి అన్నాడు.

"ఏది కాదయ్యా, మీలాంటి వారికి అయ్యోపాపం అని జాలి తలిస్తే మాకే ఎసరు పెట్టాలని చూస్తారు" అని తిట్టుకుంటూ విసురుగా గిన్నెను లాక్కొని ఇంట్లోకి వస్తూనే "ఏయ్ బబ్లూ, పింకీ, ఏం చేస్తున్నారు. ఆ ముష్టివాడు గిన్నెను ఎత్తుకుపోతుంటే చూస్తూ కూర్చున్నారా?" పిల్లల మీద కేకలేసింది.

తల్లి చేతిలోని గిన్నె చూసి క్యారమ్స్ ఆడుతున్న బబ్లూ, పరిగెత్తుకు వచ్చి "మమ్మీ ఆ గిన్నెను పింకీయే అతనికిచ్చింది" అన్నాడు. ఒక్క నిముషం అయోమయంగా వుండిపోయింది.

"చిన్నపిల్ల అది ఇచ్చిందే అనుకో. నువ్వేం చేస్తున్నావు" కోపంగా అడిగింది.

"పోనీలే మమ్మీ పాపం" జాలిగా అన్నాడు బబ్లూ.

సరళ స్తరున పింకీ దగ్గరకు వెళ్ళి రెండు చేతులు పట్టుకొని "ఏయ్ ఏమిటే నువ్వు చేసిన పని..ఎందుకిచ్చావు? ఆ బిచ్చగాడికి గిన్నె" కేకలేసింది.

"పాపం ఆ తాతకి, అన్నం తినటానికి గిన్నె లేదు. అందుకని" తల్లినే చూస్తూ ముద్దుముద్దుగా అంది. ముష్టివాడిని తాత అని సంబోధించేసరికి స్తరున మండుకొచ్చింది సరళకు.

"అయితే ఇచ్చేస్తావా?" బుగ్గమీద చిన్నగా దెబ్బవేస్తూ కోపంగా అంది సరళ.

పింకీ తల్లిని గుర్రుగా చూస్తూ- "మరి మొన్న టీవీలో ఆరోజు ఆ తాతకు ఎవ్వరూ అన్నం పెట్టలేదని ఏడ్చావు. మరి ఇప్పుడేంటి, ఈరోజు తాతకు గిన్నెలేదని ఇస్తే కొప్పడతావు" వచ్చీరాని మాటలతో ముద్దుగా చెబుతుంటే చెంపమీద ఛెళ్ళున కొట్టినట్టయింది సరళకు. మనసు హేళనగా వెక్కిరించసాగింది.

'ఏమిటి ఆరోజు టి.వి.సీరియల్‌లో బిచ్చగాడిని చూస్తూ తెగ జాలిపడిపోయావు. మరి ఈరోజు అదే పాత్ర నిజజీవితంలో తారసపడితే జాలి కురిపించకపోగా, దొంగని తిడతావా? కనీసం ఆ బిచ్చగాడు చెప్పే మాటల్ని కూడా ఓపిగ్గా వినలేనంత మూర్ఖురాలివయ్యావా? పసిమనసులకు కలిగిన దయ, జాలి కూడా నీకు లేకుండా పోయిందే? ఏదో కాలక్షేపానికి కొంచెం సేపు చూసే పాత్ర నీమీద ప్రభావం చూపించి మనసు చలింప చేస్తుంటే, నిజ జీవితంలో అటువంటి పాత్రలు తటస్థపడితే మనసు చలించదు సరికదా, వారికి చేతనైన సహాయం చేయకపోగా, వారి మీద జుగుప్స, అసహ్యం కలుగుతాయి ఎందుకని?' మనసు ప్రశ్నలమీద ప్రశ్నలు అడుగుతున్నట్టనిపించి, తప్పు చేశానన్న భావన కలిగింది సరళకు. ఆలోచిస్తూ వీధిలోకి తొంగి చూసింది. ఆ బిచ్చగాడు వీధి చివరి వరకు వెళ్ళిపోయాడు. బబ్లూను పంపి అతడ్ని పిలిపించింది. కొత్తగిన్నెలో వేడి వేడి అన్నం కూరలు వేసి అతనికిస్తూ "ఇదిగో ఈ గిన్నె నువ్వే వుంచుకో" అంటూ అతని చేతికిచ్చింది. అతను నమ్మశక్యం కాకుండా చూశాడు.

"ఫర్వాలేదు తీసుకో" అంది.

వణుకుతున్న చేతులతో అందుకున్నాడు బిచ్చగాడు. వణుకుతున్న అతని శరీరాన్ని చూసి, లోపలి నుండి చిరుగులు లేని పాత దుప్పటిని తీసుకొచ్చి ఇచ్చింది.

ఆ బిచ్చగాడి కళ్ళల్లో మెరిసిన మెరుపును సరళ, పిల్లలు గమనించకుండా వుండలేకపోయారు. చిన్న సహాయం చేయగానే అతని ముఖంలో కనిపించిన సంతోషం, ఇందాక తిట్టినప్పుడు కలిగిన ఆవేదనను కప్పివేసింది. దండంపెడుతూ సంతోషంగా వెళ్లిపోయాడు. ఇప్పుడు సరళ మనసుకు తృప్తిగా అనిపించింది. పిల్లల వైపు చూసింది. తల్లి చేసిన సహాయానికి సంతోషంతో వెలిగిపోతున్న ఆ ముఖాలను మరీ, మరీ చూడాలనిపించింది సరళకు. చిరునవ్వుతో అలాగే చూస్తూ వుండిపోయింది.

**-ఎస్.కె.నస్రీ (శ్రీకాళహస్తి)**